సాక్షి
సూర్యాపేట
గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



యాదాద్రిలో నూలుకు పూజలు

వసంత పంచమి సందర్భంగా బుధవారం యాదాద్రి ఆలయంలో పట్టు నూలుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- 10లో



మట్టపల్లిలో నిత్య కైంకర్యాలు

మట్టపల్లి క్షేత్రంలో బుధవారం నిత్యకైంకర్యాలు కొనసాగాయి. ఉదయం సుప్రభాతసేవ, అభిషేకం జరిపారు.

- 10లో



జన్మభూమి రైలులో పొగలు

సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణం వెళ్తున్న జన్మభూమి రైలులో పొగలు రావడంతో మిర్యాలగూడలో నిలిపివేశారు.

- 10లో

న్యూస్‌రీల్

సూర్యాపేట డీఎస్పీగా రవి



రవి, డీఎస్పీ

సూర్యాపేట క్రైం: సూర్యాపేట డీఎస్పీ నాగభూషణంను హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి బదిలీ చేస్తూ బుధవారం రాష్ట్ర డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట డీసీఆర్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న జి.రవిని సూర్యాపేట డీఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం విధుల్లో చేరనున్నారు.

కోదాడ డీఎస్పీగా శ్రీధర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



డీఎస్పీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీధర్‌రెడ్డి

కోదాడ: కోదాడ నూతన డీఎస్పీగా మామిళ్ల శ్రీధర్‌రెడ్డి బుధవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో కోదాడ సబ్‌డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా, సీఐగా పనిచేసిన అనుభవం తనకు ఉందని పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీకి సబ్‌డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

19న పర్యావరణ విద్య పరీక్ష

సూర్యాపేట టౌన్: ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు, గత ఏడాది రాయని ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 19న పర్యావరణ విద్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జానపాటి కృష్ణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఈ నెల 16న మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ ప్రాక్టికల్ పరీక్ష ఉంటుందని, గత ఏడాది పరీక్ష రాయని విద్యార్థులకు మాత్రమే 17న మానవ నైతిక విలువలపై పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఇంతకు ముందు ఏదేని కారణాల వల్ల ఈ పరీక్షలకు హాజరు కాని వారు, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల హాల్ టికెట్ నంబర్‌తో ఈ పరీక్షలు రాయొచ్చని తెలిపారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ తమ కళాశాల లాగిన్ నుంచి ప్రశ్నాపత్రాన్ని డౌన్‌లోడ్ చేయించి సిద్ధంగా ఉంచుకోవాని కోరారు.

గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఈ పదేళ్లలో రైతాంగ వ్యతిరేక విధానాలకు పాల్పడిందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ సిఫారసులు బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించి దేశాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్ మందారి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్‌కేఎం జిల్లా కన్వీనర్లు నెమ్మాది వెంకటేశ్వర్లు, బొడ్డు శంకర్, మట్టిపల్లి సైదులు, ప్రజా సంఘాల జిల్లా నాయకులు చెరుకు ఏకలక్ష్మి, వీరబోయిన రవి, వేల్పుల వెంకన్న, మేకన పోయిన శేఖర్, ఎం.రాంబాబు, పోలేబోయిన కిరణ్, వల్లపుదాసు సాయికుమార్, అర్వపల్లి లింగయ్య, యాతాకుల వెంకన్న, కోడి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం దిశగా..

మున్సిపాలిటీల్లో పెరగనున్న ట్రేడ్ లైసెన్స్ రుసుం

- మూడు కేటగిరీలుగా విధించే అవకాశం
- కసరత్తు ప్రారంభించిన మున్సిపల్ యంత్రాంగం
- వ్యాపారులపై పడనున్న భారం



తిరుమలగిరి మున్సిపల్ కార్యాలయం

మున్సిపాలిటీ	ట్రేడ్ లైసెన్స్ దుకాణాలు
సూర్యాపేట	598
కోదాడ	220
హుజూర్‌నగర్	15
తిరుమలగిరి	268
నేరేడుచర్ల	47

తిరుమలగిరి (తుంగతుర్తి): మున్సిపాలిటీలు తమ ఆదాయం పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. మున్సిపాలిటీల్లో ట్రేడ్ లైసెన్స్ రుసుం పెంచడం ద్వారా మరింత ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రత్యేక కార్యాచరణకు సిద్ధమయ్యాయి. 2024–25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్నది. వచ్చే ఏడాదిలో ఎంత మేరకు రుసుం పెంచాలో పురపాలక శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు వ్యాపారులపై భారం పడే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మార్చి 2వ వారం నాటికి కార్యాచరణ ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

మూడు కేటగిరీలుగా విభజన..

మున్సిపాలిటీల్లో ట్రేడ్ లైసెన్స్‌ను మూడు కేటగిరీలుగా విభజించనున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఏరియాల్లో 20 అడుగుల విస్తీర్ణం కలిగిన సింగిల్ లైన్ రోడ్లకు ఇరువైపులా ఉన్న వ్యాపార సముదాయలకు చదరపు అడుగుకు రూ.3 చొప్పున 30 అడుగుల విస్తీర్ణం కలిగిన డబుల్ లైన్ రోడ్డు పొడవునా ఉన్న దుకాణాలకు చదరపు అడుగుకు రూ.5 చొప్పున వసూలు చేయనున్నారు. ఇదే రోడ్డులో ఓటర్లు, కార్పొరేట్ ఆస్పత్రులకు చదరపు అడుగుకు రూ.6 చొప్పున రుసుము విధించనున్నారు. రెండవ కేటగిరీలో పారిశ్రామిక ప్రాంతాలు ఉంటాయి. వీటికి చదరపు అడుగుకు రూ.5 నుంచి రూ.7 వరకు రుసుం వసూలు చేస్తారు. 3వ కేటగిరీ కింద రోడ్డు వెంట ఉండే తాత్కాలిక దుకాణాలకు వాటి స్థాయిని బట్టి రుసుం విధిస్తారు.

జిల్లాలో 1,148 ట్రేడ్ లైసెన్స్ దుకాణాలు

జిల్లాలోని 5 మున్సిపాలిటీల పరిధిలో 1,148 దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయి. 2017లో వచ్చిన జీఓనంబర్ :5 ప్రకారం కొలతలు లేకుండా వ్యాపారాన్ని బట్టి ట్రేడ్ రుసుం వసూలు చేసేవారు. వాటి స్థాయిని బట్టి రూ.వెయ్యి నుంచి రూ.15వేల వరకు రుసుం ఉండేది. వీటి ద్వారా మున్సిపాలిటీలకు ఆదాయం వచ్చేది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి పన్ను పెంచితే అదనపు ఆదాయం వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

● వసంత పంచమి



వసంత పంచమి సందర్భంగా బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సరస్వతి ఉన్నత పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న టీపీయూఎస్ ప్రతినిధులు

రూ.21.45 కోట్లతో 'హుజూర్‌నగర్' బడ్జెట్

- మున్సిపల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం
- హాజరైన అదనపు కలెక్టర్ ప్రియాంక



హుజూర్‌నగర్: సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి అధ్యక్షతన కౌన్సిలర్లతో బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.21.45 కోట్లతో రూపొందించిన అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ ప్రియాంక హాజరై మాట్లాడారు. మున్సిపాలిటీల్లో పచ్చదనాన్ని మరింత పెంచాలన్నారు. గ్రీన్ బడ్జెట్‌ను ఉపయోగించుకుని పచ్చదనాన్ని మరింత పెంచాలన్నారు. పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సాధారణ పరిపాలన, సిబ్బంది జీత బత్యాలు, ఇంజనీరింగ్, నీటిసరఫరా, శానిటేషన్, ప్రజారోగ్య కార్మికులకు, పట్టణ ప్రణాళిక విభాగం, గ్రీనరీ ఖర్చుల కోసం బడ్జెట్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు కోతి సంపత్ రెడ్డి, కస్తాల శ్రవణ్, రాజానాయక్, సతీష్, ఫణికుమారి, త్రివేణి, అస్మా, రాంగోపి, కొమ్ము శ్రీను, మేనేజర్ యాకుబ్ పాష, అకౌంటెంట్ హమీద్‌బాబా, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లోనే బావుల తవ్వకం!



చెన్నారిగూడెం గ్రామంలోని రాములకుంట చెరువులో తవ్విన బావి

- చెన్నారిగూడెంలో కొందరి రైతుల నిర్వాకం
- శిఖం భూములు ఆక్రమించి యథేచ్ఛగా తవ్వకం
- రెండు చెరువుల్లో 14 వరకు బావులు
- మోటార్ల సహాయంతో పొలాలకు నీటి మళ్లింపు
- ఆయకట్టు రైతులకు మొదలైన సాగునీటి కష్టాలు

చిలుకూరు: కొందరు రైతులు రూ.కోట్లు విలువ చేసే చెరువుల శిఖాలను ఆక్రమించి సాగు చేసుకుంటుంటే.. మరికొందరు ఆక్రమించిన చెరువుల్లో ఏకంగా బావులు తవ్వి మోటార్ల ద్వారా పక్కనే ఉన్న తమ పొలాలకు సాగునీటిని తరలించుకెళ్తున్నారు. చిలుకూరు మండలం చెన్నారిగూడెం గ్రామ పరిధిలోని రెండు చెరువులకు చెందిన భూములను ఆక్రమించి దాదాపు 14 వరకు బావులు తవ్వడం చర్చనీయాంశమైంది.

రాములకుంట చెరువులో నాలుగు బావులు

గ్రామ శివారులోని 26 సర్వే నంబర్‌లో 20 ఎకరాల విస్తీర్ణం కలిగిన రాములకుంట చెరువు కింద సుమారు 100 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. ప్రస్తుతం ఈ చెరువు స్థలం దాదాపుగా 10 ఎకరాలకు పైగా ఆక్రమణకు గురైంది. ఆక్రమించి చెరువు భూమిలో పలువురు రైతులు దాదాపు నాలుగు బావులు కూడా తీసి దూరంగా ఉన్న తమ వరి పొలాలకు పైపులైన్లు ఏర్పాటు చేసి మోటార్ల సహాయం నీటిని తోడేస్తున్నారు. దీంతో 20 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన చెరువు నీళ్లు నేడు 6 నుంచి 8 ఎకరాల్లోనే ఉంటున్నాయి. ఫలితంగా చెరువులో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో ఆయుకట్టు రైతులకు నీళ్ల సమస్య రావడమే కాకుండా మత్స్యసొసైటీ సభ్యులు చేపల పెంపకానికి సరిపడా నీళ్ల లేక మత్స్య సంపద నానాటికీ తగ్గిపోతోందని ఆందోళన చెందుతున్నారు.

నరసింహులకుంటలో పది..

రాములకుంట చెరువు మాదిరిగానే గ్రామంలో ఉన్న నరసింహులకుంట చెరువులోనూ ఇదే తంతు కొనసాగుతోంది. సర్వే నంబర్ 2203లో గల నరసింహులకుంట చెరువు 55 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా ఇందులో ప్రస్తుతం 20 ఎకరాలపైనే ఆక్రమణకు గురైంది. చెరువు భూమిలో ఏకంగా పది బావులు తీసి మోటార్లతో నీటిని తరలిస్తూ పొలాలు సాగు చేసుకుంటున్నారు. ఈ రెండు చెరువుల్లో బావులు తీసి ఆయకట్టు రైతులందరికీ అందాల్సిన నీటిని కొందరు రైతులే తమ సొంతానికి వినియోగించుకుంటున్నారని అయినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ రెండు చెరువులను మిషన్ భగీరథ కింద రూ.లక్షలు వెచ్చించి లోతు తవ్వి హద్దులు నిర్ణయించారు. అయితే చెరువు భూములు ఆక్రమణ, చెరువుల్లో బావుల తవ్వకం వ్యవహారంపై జిల్లా కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఆక్రమణలు ఆగలేదు. ప్రస్తుతం సాగర్ ఎడమ కాల్వ ద్వారా నీళ్లు రాకపోవడంతో చెరువు కింద ఉన్న ఆయుకట్టు భూములను నీటి సమస్య ఏర్పడుతుందని గ్రామస్తులు అంటున్నారు. అధికారులు స్పందించి చెరువులను సర్వే చేసి ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకొని, చెరువుల్లో అక్రమంగా తీసిన బావులను తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ మానసను వివరణ కోరగా చెరువులను పరిశీలించి, భూములు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజల మన్ననలు పొందాలి : ఎస్పీ



ఏఎస్‌ఐలుగా ప్రమోషన్ పొందిన వారిని అభినందిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం: పోలీస్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలు మన్ననలు పొందాలని సూర్యాపేట ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్స్ రాములు, వెంకట్ రెడ్డి, నర్సయ్య, డానియేల్, సాలయ్య, భగవాన్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసాచారి, శ్రీనివాస్‌రెడ్డి ఏఎస్‌ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన సందర్భంగా బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాహుల్ హెగ్డేని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి ఎస్పీ ప్రమోషన్ పత్రాలను అందించి మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగోన్నతితో బాధ్యతలు పెరుగుతాయయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, పోలీస్ సంఘం అధ్యక్షుడు రామచందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

పోలీస్ కుటుంబాలకు చేయూత పథకం అండగా నిలుస్తుందని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. ఇటీవల మృతిచెందిన జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ సైదులు కుటుంబ సభ్యులకు చేయూత పథకం ద్వారా మంజూరైన రూ.2లక్షల చెక్కును బుధవారం తన కార్యాలయంలో ఎస్పీ అందజేసి మాట్లాడారు. చేయూత పథకానికి ప్రతి నెల విరాళాలు అందిస్తున్న జిల్లా సిబ్బందిని అభినందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు రాంచందర్‌గౌడ్, ఆర్ఎస్ఐ అశోక్ తదితరులు ఉన్నారు.

ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ పూర్తి



ఎఫ్ఎల్‌సీని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎంల) మొదటి లెవెల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియ పూర్తి చేశామని జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంక తెలిపారు. సమీకృత కలెక్టరేట్ ఆవరణలో ఈవీఎం గోదాములో ఈ నెల 2నుంచి జరుగుతున్న ఈవీఎంల ఎఫ్ఎల్‌సీని చివరి రోజు బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బ్యాలెట్ యూనిట్లు 2,803, కంట్రోల్ యూనిట్లు 1,742, వీవీపాట్లు 1,848, మొదటి లెవెల్ చెకింగ్ పూర్తి చేశామన్నారు. గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, డీటీ వేణు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు



కౌన్సిలర్లను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

సూర్యాపేట: సూర్యాపేట మున్సిపల్ బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రాష్ట్ర నీటిపారుదల, సివిల్ సప్లయ్ శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మొత్తం 17 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ఇటీవల చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టగా వీగిపోయింది. దీనికి నాయకత్వం వహించిన టీఆర్ఎస్ అసమ్మతి వర్గ కౌన్సిలర్ కొండపల్లి నిఖిల దిలీప్‌రెడ్డిని ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో నిఖిలకు మద్దతుగా మిగతా కౌన్సిలర్లు మూకుమ్మడిగా రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొప్పుల వేనారెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, కౌన్సిలర్లు కొండపల్లి నిఖిల, మామిడి గౌరయ్య, ధరావత్ రవి, జాటోత్ మకట్లాల్ లక్ష్మి, ధారావత్ నీలాబాయి, కుంభం రేణుక, బచ్చలకూరి శ్రీను, ఎలిమినేటి అభినయ్, మాలోత్ కమల, అనేపర్తి రాజేష్, చిరివెళ్ల లక్ష్మీకాంతమ్మ, రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, అనంతుల యాదగిరి గౌడ్, ఎస్కే జహీర్, జ్యోతి శ్రీవిద్య, గండూరి రాధిక, నామ అరుణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు అంజాద్ అలీ, జిల్లా నాయకులు కొండపల్లి దిలీప్‌రెడ్డి, గండూరి రమేష్, కుంభం రాజేందర్, రుద్రంగి రవి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జిల్లా అధికారులు





అదనపు కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, జెడ్పీ సీఈఓ వివి అప్పారావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఎన్నికల బదిలీల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన పలువురు జిల్లా అధికారులు బుధవారం తమ శాఖ కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారిగా ముధుసూదన్‌రాజు, జిల్లా పరిషత్ సీఈఓగా వివి అప్పారావు, డిప్యూటీ సీఈఓగా శిరీష బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా జిల్లా సహకార (కోపరేటివ్) అధికారిగా ఎస్.పద్మ, జిల్లా ఉపాధి కల్పన అధికారిగా అక్బర్ కూడా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పలువురు అధికారులు అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

చిన్నారుల ఆరోగ్యానికి 'పంచ సూత్రాలు'

- అంగన్‌వాడీల్లో వెయ్యి రోజుల ప్రణాళిక అమలుకు శ్రీకారం
- గర్భస్థ శిశువు నుంచి ఆరేళ్లలోపు వయసున్న పిల్లలకు పౌష్టికాహారం అందించేలా చర్యలు
- ఇప్పటికే తీవ్ర పోషణలోపం కలిగిన 636 మంది గుర్తింపు



హుజూర్‌నగర్‌లో పోషణపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది (ఫైల్)

హుజూర్‌నగర్: చిన్నారుల ఆర్యోగం, సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. దీనిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. అయినప్పటికీ కొందరు చిన్నారులు పోషణ లోపంతో బాధపడుతూనే ఉన్నారు. పోషణలోపం నివారణకు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో వెయ్యి రోజుల్లో పంచసూత్రాలు అనే కార్యక్రమాన్ని అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. పంచ సూత్రాల్లో ఈ కింది అంశాలు ఉన్నాయి.

1. గర్భస్థ దశ నుంచి..

అంగన్‌వాడీల్లోని పిల్లల్లో పోషణ లోపం లేకుండా చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన పంచసూత్రాల ప్రణాళిక ఒక మహిళ గర్భస్థ దశ నుంచి వెయ్యి రోజుల పాటు ఇది కొనసాగుతుంది. పోషణ లోపం కలిగిన చిన్నారుల్లో మార్పునకు పంచసూత్రాల అమలు ద్వారా అవసరమైన చర్యలను అంగన్‌వాడీ కేంద్రాల్లో తీసుకుంటారు.

జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు	05
అంగన్‌వాడీ కేంద్రాలు	1,209
గర్భిణులు	6,080
బాలింతలు	4,380
6 నెలల లోపు చిన్నారులు	4,561
7 నెలల నుంచి మూడేళ్లలోపు	28,250
3 నుంచి ఆరేళ్లలోపు పిల్లలు	18,612

2. పౌష్టికాహారం అందించాలని..

చిన్నారుల్లో చాలా ఆరోగ్య సమస్యలకు పోషణ లోపమే అసలు కారణం. బాల్య దశలో సరైన పౌష్టికాహారం అందించకపోతే ఎదురయ్యే ఇబ్బందులపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందించడంతోపాటు ఇంటివద్ద కూడా ఎలాంటి ఆహారం తీసుకోవాలో కూడా తెలియజేస్తున్నారు. అయితే అధికారుల లెక్కల ప్రకారం తీవ్ర పోషణ లోపంతో ఉన్న చిన్నారులు 550 మంది, అతితీవ్ర పోషణ లోపంతో ఉన్న వారు 86 మంది ఉన్నట్లు గుర్తించారు.

3. రక్తహీనత నివారణకు..

పేదరికం కారణంగా చాలా మంది చిన్నారుల్లో రక్తహీనత సమస్య తలెత్తుతోంది. ఇలాంటి చిన్నారులను గుర్తించి అదనపు పౌష్టికాహారం అందిస్తారు. తద్వారా చిన్నారుల్లో రక్తహీనత సమస్యను నివారింపజేస్తారు.

చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలని..



చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం పంచసూత్రాలు అమలు చేస్తోంది. పోషణ లోపంతో వయస్సుకు తగ్గ ఎత్తు, బరువులేని చిన్నారులను గుర్తించి వారి ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడడంతోపాటు, వారు ఆరోగ్యంగా ఎదిగేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తాం.

– జ్యోతి పద్మ, జిల్లా సంక్షేమ అధికారి, సూర్యాపేట

4. డయేరియా బారిన పడకుండా..

కలుషిత నీరు తదితర కారణాలతో పలుచోట్ల చాలా మంది చిన్నారులు డయేరియా బారిన పడుతున్నారు. ఇది వారి శారీరకవి దుగుడలపై ప్రభావం చూపుతోంది. నిర్లక్ష్య చేస్తే పరిస్థితి చేయి దాటి ప్రమాదమూ ఉంటుంది. డయేరియాకు ఎలా దూరంగా ఉండాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు.

5. శుభ్రత.. జాగ్రత్తలు

సుచి, శుభ్రత పాటించకపోవడం వల్లే వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతుంటాయి. పరిసరాలు పరిశుభ్రత, వంటకాల తయారీలో జాగ్రత్తలు పాటించకపోవడం, చేతులు శుభ్రం చేసుకోకపోవడం వల్ల వ్యాధులు ప్రబలుతాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలు అధికంగా ఉంటాయి. ఈవిషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి గ్రామీణులను అప్రమత్తం చేస్తారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వీరేశం, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



కోలాట ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులు

వైభవంగా నగరోత్సవం

రామగిరి(నల్లగొండ): నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులో ఈనెల 14 నుంచి 21వరకు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం నల్లగొండలో నగరోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. 2019లో రద్దయిన నగరోత్సవం మంత్రి వెంకట్‌రెడ్డి చొరవతో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో తిరిగి ఈసారి నిర్వహించారు. బ్రహ్మోత్సవాల విశిష్టతను తెలియజేసేందుకే నగరోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వీరేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రవి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత

భువనగిరి క్రైం : మండలంలోని బొల్లేపల్లి గ్రామానికి చెందిన సందెల అశోక్ తన భార్యతో కలిసి జనవరి 20న జిల్లా కేంద్రం నుంచి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో అతడి సెల్‌ఫోన్ పడిపోయింది. బాధితుడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేశారు. మొబైల్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి ఈఎంఈఐ నంబర్ ఆధారంగా ఆచూకీ కనిపెట్టారు. బుధవారం ఎస్‌ఐ సంతోష్‌కుమార్ బాధితుడు అశోక్‌కు మొబైల్ అందజేశారు. బాధితులు ఫోన్ పోగొట్టుకుంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ తెలిపారు.

గడ్డిమందు తాగిన వ్యక్తి మృతి

మునగాల(కోదాడ): ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన మండవ నర్సయ్య (49)కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ నెల 2వ తేదీన ఇంటి వద్ద గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బైరెడ్డి అంజిరెడ్డి తెలిపారు.

తొమ్మిది మందికి జరిమానా

మిర్యాలగూడ అర్బన్: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురికి కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ మోహన్‌యాదవ్ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మిర్యాలగూడ పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 9మంది పట్టుబడ్డారని, వారిని కోర్టులో హాజరుపర్చగా రూ.14.7వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

40బస్తాల ధాన్యం చోరీ

గుర్రంపోడు : గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయ బావి వద్ద షెడ్డులో ఉంచిన ధాన్యాన్ని చోరీ చేశారు. గుర్రంపోడు మండలం ఆమలూరు గ్రామంలో రైతు బొమ్ము నర్సింహ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత వానాకాలం సీజన్ ధాన్యం 40 బస్తాల ధాన్యాన్ని బావి వద్ద ఉన్న షెడ్డులో ఉంచాడు. మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆ ధాన్యం బస్తాలతో పాటు 5లీటర్ల గడ్డిమందును అపహరించుకుపోయారు. నర్సింహ బుధవారం బావి వద్దకు వెళ్లగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు నర్సింహ తెలిపాడు. కేసు విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతరలు వచ్చే.. సందడి తెచ్చే

- మాఘ మాసంలో పీఏపల్లి మండలంలో ఆధ్యాత్మికశోభ
- ఇక్కడి ఆలయాల్లో పక్షం రోజుల పాటు సాగనున్న ఉత్సవాలు
- ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు



పీఏపల్లి మండలం బాలాజీనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం

పెద్దఅడిశర్లపల్లి : మాఘ మాసం వచ్చిందంటే పెద్దఅడిశర్లపల్లి మండలంలోఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతుంది. పూజలే కాదు.. ఆటలు.. సాంస్కృతిక మేళవింపుతో సందడి నెలకొంటుంది. పీఏపల్లి మండలంలోని బాలాజీనగర్, కోదండాపురంలలో శ్రీ వేంకటేశ్వరస్వామి, మేడారంలో లక్ష్మీనరసింహస్వామి దేవాలయాల్లో ప్రతి ఏడాది ఈ మాసంలో పక్షం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. వేడుకలకు స్థానికులే కాకుండా వేర్వేరు జిల్లాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు.

బాలాజీ ఉత్సవాల గాథ ఇది

పూర్వ కాలంలో ఏలేశ్వరం గ్రామంలో ఉండే ప్రజలే ఈ బాలాజీనగర్ వాసులని, గాంగ్య అనే ఓ గిరిజనుడు సంతానం కలగలేదు. దీంతో శ్రీ వేంకటేశ్వరస్వామిని భక్తిశ్రద్ధలు, నిష్టతో పూజలు చేసి ఆరాధించాడు. అయితే స్వయంగా శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రత్యక్షమై నీకు ఆరుగురు కుమారుల సంతానం కలుగుతుందని, ఒక చోటికి తీసుకెళ్లి జెండా, ఇత్తడి బిందెను అందించాడు. నీకు సంతానం కలిగాక బాలాజీనగర్ దేవాలయంలో ప్రతి మాఘ మాసంలో జాతరను జరపాలని సూచించినట్లు పురాణ గాథ ఉంది. స్వామి వారు చెప్పినట్లు ఆ గిరిజన దంపతులకు ఆరుగురు సంతానం కలగడం, ఆ ఆరుగురు సంతానమే ఒక తండాగా ఏర్పడడంది. సుమారు 52 ఏళ్లపైగా ఈ జాతర జరుగుతుందని ఇక్కడి ప్రజలు పేర్కొంటున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఇక్కడి వాసులు 41 రోజుల పాటు దీక్ష చేపడుతారు.

ఆటలు.. సాంస్కృతిక ప్రదర్శనలు

పీఏపల్లి మండలంలో జరిగే జాతరలో ప్రత్యేక ఆకర్షణగా ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిలుస్తున్నాయి. కోలాట బృందం చేసే హడావుడి అంతా ఇంత కాదు.. మహిళలు, చిన్నారులు ఆటపాటలతో కోలాటం ఆడుతుంటారు.. ఇక దేవాలయాలు విద్యుత్ ప్రభల వెలుగులతో జిగేలుమనిపిస్తుంటారు.. మొత్తంగా ఆధ్యాత్మిక శోభతో మండలం ఒలలాడుతోంది. దీంతో పాటు జాతరను పురస్కరించుకొని రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కబడ్డీ, క్రికెట్ పోటీలతో యువత ఉత్సాహంగా పాల్గొంటుంది.

బ్రహ్మోత్సవాల ముఖ్య ఘట్టాలు

బాలాజీనగర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి 52వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సీతారామచంద్రస్వామి పూజ, శుక్రవారం గణపతిపూజ,పుణ్యావాచనం, రుద్రాభిషేకం,హనుమదాభిషేకం, శనివారం సీతారాముల కల్యాణోత్సవం, అగ్నిగుండం, జాతర, ప్రభ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అలాగే మేడారం ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం తెల్లవారుజామున ఉదయం 4 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం, శనివారం తెల్లవారుజామున ఉదయం 4 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఫిబ్రవరి 15,16 వ తేదీల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. కోదాడాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 29 న వేంకటేశ్వరస్వామి పూజలతో మొదలుకొని మార్చి 2 తెల్లవారితే 3న స్వామి వారి కల్యాణోత్సవంతో, మార్చి4న రాత్రి తెల్లవారితో 5న రథోత్సవం,6న పూర్ణాహుతి,ఏకాంతసేవ,దోపోత్సవంతో ముగియనున్నాయి.

మేడారంలో వెలిసిన లక్ష్మీనరసింహ స్వామి

పీఏపల్లి మండలంలోని మేడారం గ్రామంలో 11 సంవత్సరాల క్రితం నిర్మించిన మేడారం దేవాలయం నిర్మించారు. మాఘమాసం పురస్కరించుకొని ఇక్కడ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు.



మేడారంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం

రెండో తిరుపతిగా..

పీఏపల్లి మండలం కోదండాపురం గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి 408 సంవత్సరాల చరిత్ర ఉంది. తేరా లక్ష్మమ్మ అనే మహిళ తిరుపతికి వెళ్లిందని.. ఆమె భక్తికి మెచ్చిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆమెతో కలిసి మూడు అడుగులు వేసి పీఏపల్లి మండలంలోని కోదండాపురంలోని గుట్టపై మూడో అడుగు వేశారని, జమ్మిడి చెట్టుపై ప్రత్యక్షమైనట్లు, రాబోయే రోజుల్లో ఇది దిగువ తిరుపతిగా విరాజిల్లుతుందని స్వామి వారు చెప్పినట్లు ఓ గాథ ప్రచారంలో ఉంది. ప్రతి ఏడాది మాఘమాసంలో వారం రోజుల పాటు కోదండాపురంలో శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయి. ఇక్కడికి స్థానికులే కాకుండా వేర్వేరు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు జరపడంతో పాటు కానుకలు సమర్పిస్తుంటారు.



కోదండాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం

కమనీయం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం

పీఏపల్లి మండలంలోని బాలాజీనగర్, మేడారం, కోదండాపురంలలో జరిగే జాతర సందర్భంగా శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం అత్యంత ముఖ్యమైంది. స్వామి వారి కల్యాణ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఈ ప్రాంతాలకు తరలివస్తుంటారు. కళ్యాణంతో పాటు రథోత్సవ వేడుకలు జాతరకే వన్నె తెస్తుంటాయి. ఉదయం మొదలుకొని రాత్రి వరకు జరిగే ఈ కల్యాణ, రథోత్సవ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తలంబ్రాండ్లు సమర్పిస్తుంటారు.

హోంగార్డు కుటుంబానికి మంత్రి ఆర్థికసాయం

నల్లగొండ : బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండలో నిర్వహించిన బహిరంగ బందోబస్తు విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్ హోంగార్డు నవ కిశోర్ మృతదేహాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులు బుధవారం నల్లగొండ మండలం అన్నెపర్తిలో సందర్శించారు. ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం మృతుడి కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పంపించిన రూ.2లక్షల ఆర్థికసాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, కౌన్సిలర్ అంగోతు ప్రదీప్ నాయక్ తదితరులు ఉన్నారు.



మృతుడి కుటుంబ సభ్యులకు రూ.2లక్షల నగదు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి

చేపల కోసం చెరువులో నీరు ఖాళీ చేసే యత్నం

- అడ్డుకున్న వట్టిఖమ్మంపహాడ్ గ్రామస్తులు

చివ్వెంల(సూర్యాపేట) : చేపలు పట్టుకునేందుకు వ్యాపారులు చెరువునీరు ఖాళీ చేసేందుకు యత్నించగా గ్రామస్తులు అడ్డుకున్నారు. చివ్వెంల మండలం వట్టిఖమ్మంపహాడ్‌లో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొందరు వ్యాపారులు గ్రామ శివారులోని పెద్ద చెరువును వేలంలో కైవసం చేస్తుకున్నారు. చెరువులో పెంచిన చేపలు పట్టుకునేందుకు రెండు రోజులుగా సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైర్లకు కొండ్లు తగిలించి, 5హెచ్‌పీ మోటార్‌తో నీటిని తొలగిస్తున్నారు. గమనించిన సమీప రైతులు విషయాన్ని గ్రామస్తులకు తెలుపడంతో సంఘటన స్థలానికి చేరుకున్న నీటి తోడకాన్ని అడ్డుకున్నారు. అనంతరం గ్రామ ప్రత్యేరాధికారి పి.సంతోష్ కుమార్, విద్యుత్ ఏఈ మల్లయ్య, రెవెన్యూ , ఇరిగేషన్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో విద్యుత్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని అక్రమంగా తగిలించిన కొండ్లను తొలగించి, విద్యుత్‌వైరును సీజ్ చేశారు. నీటి తొలగింపునకు పాల్పడిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామ ప్రత్యేకాధికారి సంతోష్ తెలిపారు.



చెరువులో మోటార్‌ను తొలగిస్తున్న గ్రామస్తులు

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

రామగిరి(నల్లగొండ): వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు బలవన్మరణానికి పాల్పడ్డారు. తిప్పర్తి మండలం, సూర్యాపేట పట్టణంలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. తిప్పర్తి మండలం జొన్నగడ్డలగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని బండ్లవారిగూడెం గ్రామానికి చెందిన పిల్లి నాగరాజు(34) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు అప్పు చేశాడు. ఇటు వ్యవసాయం కలిసి రాక, అటు ఆర్థిక ఇబ్బంది అధికం కావడంతో తట్టుకోలేక ఇంట్లోని స్నానాల గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం నిద్రలేచి బాత్‌రూమ్ వద్దకు వెళ్లి చూసేసరికి విగతజీవుడిగా కనిపించాడని భార్య లక్ష్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాగరాజుకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ డి.రాజు తెలిపారు.



మృతుడు జాన్

మద్యానికి బానిసై..

సూర్యాపేట క్రైం : పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సూరారపు జాన్(45) భార్య 2017లో మృతిచెందింది. అప్పటి నుంచి మద్యానికి జాన్ మద్యానికి బానిసగా మారాడు. జీవితంపై విరక్తితో జాన్ ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సాయితేజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

26 డొమెస్టిక్ సిలిండర్ల పట్టివేత

చిట్యాల: పట్టణంలోని పలు హోటల్స్, టిఫిన్ సెంటర్లతో పాటు ఇతర వ్యాపార దుకాణాల్లో అనుమతులు లేకుండా వినియోగిస్తున్న 26 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను బుధవారం సివిల్ సప్లయ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. పలువురి ఫిర్యాదు మేరకు టిఫిన్ సెంటర్స్, హోటల్స్‌లో అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. పట్టుకున్న సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు అప్పగించారు. ఈ తనిఖీల్లో సివిల్ సప్లయ్ ఆర్ఐ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



పట్టుకున్న సిలిండర్లతో అధికారులు

మిర్యాలగూడలో 26 సిలిండర్లు..

మిర్యాలగూడ: గృహ అవసరాల కోసం వినియోగించే వంట గ్యాస్ సిలెండర్లను దామరచర్ల కేంద్రంలో పలు హోటళ్లల్లో ఉపయోగిస్తుండడంతో విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ డీటీలు జావెద్, ముక్తర్‌లు మాట్లాడుతూ గృహ అవసరాల కోసం ఉపయోగించే వంట గ్యాస్ సిలెండర్లను దామరచర్ల మండల కేంద్రంలోని పలు హోటళ్లు, దుకాణాదారులు ఉపయోగిస్తూ రీఫిల్లింగ్ చేస్తున్నారన్న సమాచారం అందడంతో ఎనిమిది హోటళ్లు, రెండు కిరాణ దుకాణాల్లో దాడులు చేసి 26 సిలిండర్లను పట్టుకుని స్థానిక గ్యాస్ ఏజెన్సీకి అప్పగించినట్లు తెలిపారు. ఈ మేరకు హోటళ్లు, దుకాణదారులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

పెద్దఅడిశర్లపల్లి : విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందింది. పెద్దఅడిశర్లపల్లి మండలం మేడారం గ్రామానికి చెందిన గొంగడాల జానమ్మ (33) తన ఇంట్లో టీవీ స్విచ్ ఆన్ చేస్తుండగా చేతికి వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురైంది. కుటుంబ సభ్యులు గమనించేలోపే ఆమె విగతజీవురాలిగా కనిపించింది. సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త గొంగడాల శ్రీనయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.



జానమ్మ మృతదేహం

కంపచెట్లలో పసికందు లభ్యం

మఠంపల్లి: గుర్తుతెలియని వ్యక్తులు కండ్లు కూడా తెరవని ఆడశిశువును కంపచెట్లలో వదిలేశారు. ఈ హృదయ విదారక ఘటన సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. సుమా రు వారం రోజుల క్రితం జన్మించిన ఆడపిల్లను మండలంలోని పెదవీడు రెవెన్యూ పరిధి సుల్తాన్‌పూర్‌తండా పునరావాస కేంద్రంలో గల కంపచెట్లలో వదిలివేశారు. కేకలు విన్న స్థానికులు కంపచెట్లలో పరిశీలించగా తీవ్ర గాయాలతో పసికందు కనిపించింది. స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది అక్కున చేర్చుకున్నారు. అనంతరం ఐసీడీఎస్ ఉన్నతాధికారులు, పోలీసులు శిశువును హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం అక్కడినుంచి సూర్యాపేట జిల్లా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. పసికందు విషయంపై రాత్రి వరకు ఐసీడీఎస్ అధికారులు గోప్యత పాటించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



కంపచెట్లలో దొరికిన పసికందు

హైదరాబాద్‌లో నకిరేకల్ వాసి మృతి

నకిరేకల్ : హైదరాబాద్‌లోని ఎల్.బి.నగర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నకిరేకల్ వాసి మృతిచెందాడు. పట్టణంలోని కాటమయ్య బజార్‌కు చెందిన సాదిఖ్ అలీ(43) ప్రస్తుతం చార్మినార్ ఎక్సైజ్ సీఐగా పనిచేస్తున్నాడు. ఈయన ఓయూలో పీజీ పూర్తి చేశారు. ఏడేళ్ల క్రితమే ఎక్సైజ్ ఎస్‌ఐ ఉద్యోగం సాధించారు. పదోన్నతి రావడంతో చార్మినార్ ఎక్సైజ్ సీఐగా విధులు నిర్వహిస్తూ అక్కడే ఉంటున్నారు. మంగళవారం అర్ధరాత్రి మలక్‌పేట్ రోడ్డులో తన బుల్లెట్ వాహనంపై మరో ఎస్‌ఐతో కలిసి వెళ్తూ యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని బుధవారం ఆయన స్వగ్రామం నకిరేకల్‌కు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మతదేహాన్ని టీపీసీసీ నేత దైద రవీందర్ పూల మాలమాలలు వేసి నివాళులర్పించారు. ఎక్సైజ్ సీఐ సాదిఖ్ అలీ మృతితో నకిరేకల్ పట్టణంలో విషాదం అలుముకుంది.



సాదిఖ్ అలీ (ఫైల్)



నివాళులర్పిస్తున్న దైద రవీందర్

వృద్ధురాలు అదృశ్యం

చౌటుప్పల్ : మండల పరిధిలోని మసీదుగూడెం గ్రామపంచాయతీ మదిర శేరీల గ్రామంలో మంగళవారం వృద్ధురాలు అదృశ్యమైంది. గ్రామా నికి చీరిక రాములమ్మ(75) మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఇంటివద్ద నుంచి చేతి కర్ర సాయంతో నడుచుకుంటూ వెళ్లింది. రోజువారి మాదిరిగా గ్రామంలోనే ఉంటుందని భావించినప్పటికీ సాయంత్రం వరకు కూడా రాలేదు. దాంతో ఆచూకీ కోసం పరిసరాల్లో గాలించారు. బంధువులను వాకబుచేశారు. అయినా ఆచూకీ లభించలేదు. దాంతో కుటుంబసభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

మహిళ అదృశ్యం

భువనగిరి క్రైం : మహిళ అదృశ్యమైంది. భువనగిరి మండలం బస్వాపురం గ్రామానికి చెందిన ఉడుత చంద్రకళ (30) సిద్దిపేట జిల్లా మాందాపురం గ్రామానికి చెందిన సోదరి ఇంటికి వెళ్తున్నాని మంగళవారం సాయంత్రం తన కుమారుడితో కలిసి వెళ్లి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు సోదరిని ఆరా తీయగా రాలేదని తెలిసింది. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. చంద్రకళ తల్లి ఉడుత మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



కుమారుడితో చంద్రకళ (ఫైల్)

సమీకృత వ్యవసాయంతో లాభాలు



చేపల చెరువును పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రవీందర్

నడిగూడెం : సమీకృత వ్యయసాయంతో అధిక లాభాలు పొందవచ్చని పాలేరు మత్స్య పరిశోధనా స్థానం శాస్త్రవేత్త బి.రవీందర్ తెలిపారు. బుధవారం నడిగూడెం మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన ఆదర్శ రైతు వాసికర్ల శేషుకుమార్ సమీకృత వ్యవసాయంలో భాగంగా ఆయన చేపట్టిన చేపల చెరువును పరిశీలించిన రైతులతో మాట్లాడారు. సమీకృత వ్యవసాయంలో భాగంగా చేపల పెంపకంతో అదనపు లాభాలు పొందవచ్చని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట వాసికర్ల శేషుకుమార్, మొక్క లక్ష్మ య్య, తదితరులున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నకిరేకల్ : ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. నకిరేకల్ మండలం పదిరెగూడేనికి చెందిన కదిరే సంజీవరెడ్డి(45) మద్యానికి బానిసై ఈనెల 10న ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని నల్లగొండ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

మల్చింగ్ సాగు.. లాభాలు బాగు

- చీడపీడలు, కలుపు నివారణకు చెక్
- తక్కువ నీటివనరులతో అధిక దిగుబడులు



మల్చింగ్ పద్ధతిలో సాగు చేసిన టమాట పంట



మల్చింగ్ పద్ధతిలో సాగు చేసిన బీర పైరు



మల్చింగ్ గురించి రైతుకు వివరిస్తున్న మధు

పాడి పంట

నడిగూడెం : రానున్న వేసవిలో అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా ఉపయోగించి పంటలను సాగు చేసేందుకు మల్చింగ్ విధానం తోడ్పడుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడం వల్ల ఉద్యానవన పంటలకు సరిపడేంత నీటిని అందించడం రైతులకు తలకు మించిన భారంగా మారనుంది. ఈ సమయంలో దీని నుంచి బయట పడేందుకు రైతులు ప్రత్యామ్నాయ పద్ధతులు పాటిస్తే అందుబాటులో ఉన్న నీటి వనరులను ఉపయోగించుకొని పంటలను సమర్థంగా సాగు చేసుకోవచ్చని హార్టికల్చర్ కన్సల్టెంట్ కుడుముల మధు చెబుతున్న సలహాలు, సూచనలు..



కుడుముల మధు, హార్టికల్చర్ కన్సల్టెంట్

మల్చింగ్ అంటే..

సారవంతమైన మట్టిని పట్టి ఉంచడంతో పాటు నేలలోని తేమను ఎక్కువ కాలం ఉంచేలా మొక్క చుట్టూ పలు రకాలైన పదార్థాలను పరచి ఉంచడాన్నే మల్చింగ్ అంటారు. ఈ పద్ధతిలో తేమ ఆవిరికాకుండా మొక్క చుట్టూ ఎక్కువ కాలం ఉంటుంది. మల్చింగ్‌లో ప్లాస్టిక్ పట్టాలతో పాటు కాగితపు ముక్కలు సేంద్రియ పదార్థాలు, వరిగడ్డి, వ్యవసాయ వ్యర్థాలు తదితర వాటిని ఉపయోగిస్తారు.

మల్చింగ్ విధానంతో లాభాలు

మల్చింగ్ చేయడం వలన నేలలోని తేమ ఆవిరి కాకుండా ఎక్కువ రోజులు మొక్క మొదలు భాగంలో తేమగా ఉంటుంది. తేమను పరిరక్షించడమే కాకుండా ఉష్ణోగ్రత వ్యత్యాసాల వలన నేల భౌతిక స్థితి దెబ్బతినకుండా ఉంటుంది. నేలలోని సారవంతాన్ని కాపాడటంలో ఈ మల్చింగ్ ప్రధాన పాత్ర వహిస్తుంది. పంటలు సాగు చేయని కాలంలో సారవంతమైన మట్టిని కప్పి ఉంచుతుంది. మొక్కల మధ్య మల్చింగ్ పదార్థాలు ఉండడంతో కలుపును బాగా నియంత్రించడంతో పోషకాలన్నీ మొక్కలు తీసుకునేందుకు వీలుంటుంది. నత్రజని స్థిరీకరణ జరిగి నేలలో పోషకాల స్థాయి కూడా సహజసిద్ధంగా పెరుగుతుంది. ఈ మల్చింగ్ విధానాన్ని దీర్ఘకాలంగా చేస్తే పంటల్లో గణనీయమైన పెరుగుదలతో పాటు చీడ, పీడలను తట్టుకొనే శక్తి పెరుగుతుంది. అంతే కాకుండా పంటల ఉత్పాదనలో కూడా మెరుగుదల కన్పిస్తుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మల్చింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. భౌగోళిక పరిస్థితులను, నేల స్వభావాన్ని బట్టి మల్చింగ్ అనేది చేసుకోవాలి. మల్చింగ్‌తో పాటు సూక్ష్మనీటి పద్ధతులను అవలంబిస్తే నీటి వనరులను కూడా వృథా కాకుండా సమర్థంగా ఉపయోగించుకోవచ్చు. సాగు చేసే పంటలను బట్టి మల్చింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ఎక్కువ విస్తీర్ణంలో మల్చింగ్‌ను చేయదలిస్తే అందుబాటులో ఉండే వనరులను మల్చింగ్ పదార్థాలుగా ఉపయోగించడం మేలు.